# పార్టీ 21వ మహాసభ నిర్దేశించిన రాజకీయ ఎత్తుగడల పంథా

సిపిఐ(ఎం) మరియు వామపక్షాలు తీవ్ర సంక్లిష్ట పరిస్థితులను, సవాళ్ళను ఎదుర్కొంటున్న తరుణంలో సిపిఐ(ఎం) 21వ అఖిల భారత మహాసభ నిర్వహించబడింది. 2014 మే నెలలో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించి, కేంద్రంలో నరేంద్రమోడి అధికారం చేపట్టిన నాటినుండి మతవాద అభివృద్ధి నిరోధక దాడులు అధికమయ్యాయి. బిజెపి ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తున్న నేయా వుదారవాద విధానాలకు బడా బూర్జువావర్గం, విదేశీ ద్రవ్యపెట్టుబడి ప్రధాన సమర్థకులుగా వున్నారు. ఆర్ఎస్ఎస్, హిందూ మతోన్మాద శక్తులు ప్రస్తుత పరిస్థితిని, తమ మతోన్మాద ఎజండాను ముందుకు తీసుకెళ్ళేందుకు మంచి అవకాశంగా భావించాయి. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో చాలా బలాల పొందికను తనకనుకూలంగా మలచుకునే పథకంలో భాగంగా తన వ్యూహాత్మక దుస్సాహసిక కృత్యాల్లో భాగస్వామి అయ్యే విధంగా మోడి ప్రభుత్వాన్ని యిరికించడంలో అమెరికా విజయవంతమైంది.

దేశంలోని అతి పెద్ద వామపక్ష పార్టీ అయిన సిపిఐ(ఎం) ఎన్నికల్లో తీవ్ర ప్రతికూలత నెదుర్కొన్న సమయంలో ఈ పరిణామాలు సంభవిస్తున్నాయి. పార్టీకి అత్యంత బలమైన పశ్చిమ బెంగాల్‌లో పార్టీమీద తీవ్రమైన దాడులు జరగడంతో పార్టీ బలహీనపడింది. వామపక్షం మొత్తంగానే తీవ్రంగా నష్టపోయింది. ఈ సంక్లిష్ట పరిస్థితి నెదుర్కొని, పార్టీని నవీకరించి, నూతన జవసత్వాలు కల్గించి, అభివృద్ధి పథాన నడిపేందుకు దోహదం చేసే విధంగా సరైన రాజకీయ ఎత్తుగడల పంథాను రూపొందించుకొనవల్సి వుంది. అందువలన, ఈ మహాసభ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ లక్ష్య సాధనకు, ముందుగా, ఇప్పటివరకు మనం అనుసరిస్తూ వస్తున్న రాజకీయ ఎత్తుగడల పంథాను పునఃపరిశీలించుకొనవల్సిన అవసరం వుందని పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయించింది. మనం యిప్పటివరకూ అనుసరిస్తున్న రాజకీయ ఎత్తుగడల పంథాలో ఏమైనా లోపాలు వున్నాయా, లేదా ఆ రాజకీయ ఎత్తుగడల పంథాను అమలు చేయడంలో ఏమైనా పొరపాట్లు జరిగాయా, అనేక విషయాలను పరిశీలించి, సరిదిద్దుకోవడం అవసరం.

## రాజకీయ ఎత్తుగడల పంథా సమీక్ష

25 సం॥ల పరిణామాలను నివేదిక సమీక్షించింది. 1988-89లో తిరువనంతపురంలో జరిగిన 13వ పార్టీ అఖిల భారత మహాసభ మొదలుకుని, 25 సంవత్సరాల కాలంలో జరిగిన పరిణామాలను నివేదికలో సమీక్షించడం జరిగింది. ఎందుకంటే, అప్పటి నుండే అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో ప్రాధాన్యత గల్గిన పరిణామాలు చోటు చేసుకున్నాయి. సోవియట్ యూనియన్ పతనం అంతర్జాతీయ స్థాయిలో వర్గశక్తుల బలాబలాల్లో ప్రధాన మార్పులకు కారణమైంది. భారతదేశంలో 1990 దశకం ప్రారంభంతోనే సరళీకరణ క్రమం ప్రారంభమైంది. ఈ కాలంలోనే హిందూ మతోన్మాద శక్తులు పుంజుకున్నాయి.

1992లో జరిగిన పార్టీ 14వ మహాసభ నుండి వివిధ మహాసభల్లో ఆమోదించబడిన రాజకీయ ఎత్తుగడల పంథా, ఆనాడు నెలకొన్న తక్షణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు, ఆయా పరిస్థితులను బట్టి ప్రధాన ప్రమాదంగా ముందుకు వచ్చిన కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా పోరాడేందుకు పార్టీకి వుపయోగపడింది. మతోన్మాద, వేర్పాటువాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడేందుకు, వామపక్ష శక్తుల ఐక్యతను నిర్మించేందుకు, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో వామపక్షాల నాయకత్వంలో ప్రభుత్వాలు ఏర్పరచేందుకు, పశ్చిమబెంగాల్‌లో వామపక్ష కూటమి ప్రభుత్వాన్ని పటిష్టం చేసేందుకు ఈ రాజకీయ ఎత్తుగడల పంథా సరైన మార్గనిర్దేశం చేసింది. కార్మికోద్యమ ఐక్యతను నిర్మించడానికి ఈ రాజకీయ ఎత్తుగడల పంథా దోహదం చేసింది. గత రెండు దశాబ్దాల కాలంలో కేంద్ర ట్రేడ్ యూనియన్లు నిర్వహించిన 15 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలు ఈ విషయాన్ని విదితం చేస్తున్నాయి.

### దిగజారిన వామపక్ష ప్రజాతంత్ర కూటమి పరిస్థితి

ఏమైనప్పటికీ, పార్టీ విస్తరణ కేవలం కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర మూడు రాష్ట్రాలకే పరిమితమైంది. పార్టీ సభ్యత్వం, ప్రజాసంఘాల సభ్యత్వంలో అత్యధిక భాగం ఈ మూడు రాష్ట్రాలోనే కేంద్రీకృతమైంది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో పార్టీ సభ్యత్వం, ప్రజాసంఘాల కార్యకలాపాలు పెరిగాయి. అయితే పార్టీ పునాది గాని, పార్టీ పలుకుబడి గాని చెప్పుకోదగినంతగా పెరగలేదు. ఇందుకు కారణమైన కొన్ని లోటుపాట్లను సమీక్షలో ఎత్తి చూపడం జరిగింది. వామపక్ష ప్రజాతంత్ర సంఘటన అనేది కనుచూపుమేరలో లేని, ఆచరణాత్మకం కాని నినాదంగా పరిగణించబడి తిరస్కరణకు గురికావడమే ఈ రాజకీయ ఎత్తుగడల పంథాలో వున్న ప్రథమ బలహీనత. వామపక్ష ప్రజాతంత్ర శక్తులను సమీకరించి, వామపక్ష ప్రజాతంత్ర సంఘటనను నిర్మించేందుకు పోరాటం చేపట్టడం జరగలేదు. దీనికి బదులుగా, వామపక్ష ప్రజాతంత్ర లౌకిక సంఘటన పేరిట ఒక మధ్యంతర దశ లేదా సంఘటన ఏర్పాటుకు పిలుపు యివ్వటం జరిగింది. మొదట్లో ఇది కేంద్రంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగానూ, ఆ తర్వాత బిజెపికి వ్యతిరేకంగానూ నిర్మించబడింది.

ఆ తర్వాత దీనిని 1998లో జరిగిన పార్టీ 16వ మహాసభలో మూడవ ప్రత్యామ్నాయంగా పేర్కొనడం జరిగింది. ఈ విధమైన సంఘటన ప్రధానంగా ప్రాంతీయ బూర్జువా పార్టీలతో కూడిన కాంగ్రెసేతర బూర్జువా సెక్యులర్ పార్టీల కూటమిగా భావించబడింది. కాంగ్రెస్, బిజెపిల విధానాలకు ప్రత్యామ్నాయంగా ఒక వుమ్మడి కార్యక్రమం లేదా విధానాలు ప్రాతిపదికగా ఒక మూడవ ప్రత్యామ్నాయంగా రూపొందించే దిశలో ఈ పార్టీలనన్నింటిని కూడగట్టే ప్రయత్నం చేయాలనేది అసలు వుద్దేశం. గత రెండు దశాబ్దాల కాలంలో ప్రాంతీయ బూర్జువా పార్టీల్లో ప్రధానమైన మార్పులు చోటు చేసుకోవడంతో ఈ లక్ష్యం నెరవేరలేదు. అంతేగాక యిది ఆచరణాత్మకం కాదని కూడా తేలింది. ప్రాంతీయ బూర్జువా పార్టీలు తమ వర్గ ప్రయోజనాల దృష్ట్యా నయా వుదారవాద విధానాలకు వ్యతిరేకం కాదు. తమ ప్రయోజనాల కనుకూలంగా వుంటుందనుకుంటే ఈ పార్టీలు, కాంగ్రెస్‌తో గాని, బిజెపితోగాని చేతులు కలిపి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వంలో చేరి అధికారం

పంచుకోవడానికి వ్యతిరేకం కాదు. అందువల్ల వారిని ప్రత్యామ్నాయ వేదిక మీదకు తీసుకు రావాలన్న వుద్దేశం నెరవేరలేదు. అంతేగాక అది ఆచరణాత్మకం కాదని రుజువయ్యింది.

### ప్రాంతీయ పార్టీల పాత్ర

ప్రాంతీయ పార్టీల పాత్ర మారుతున్న విషయాన్ని మన పార్టీ 16, 17 మహాసభల నుండే మనం గమనిస్తున్నాం. ప్రపంచీకరణ ప్రభావం వల్ల నయా వుదారవాద విధానాల అమలు దశలో ప్రాంతీయ బూర్జువా వర్గంలోని కొన్ని తరగతులు బడా బూర్జువా వర్గ స్థాయికి ఎదిగాయి. అంతేగాక బడాయేతర బూర్జువా వర్గానికి, బడా బూర్జువా వర్గానికి మధ్య వైరుధ్యాలు సద్దుమణిగాయి. అందువల్ల ప్రాంతీయ బూర్జువా పార్టీలు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చినపుడు, అవే నయా వుదారవాద విధానాలు చేపట్టాయి. అంతేగాక, ప్రధాన ప్రాంతీయ పార్టీలు గ్రామీణ సంపన్న వర్గాలైన భూస్వాములు, ధనికరైతులు, కాంట్రాక్టర్లు, బడా వ్యాపారవర్గాల కూటమికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అందువల్ల పేద రైతాంగం, వ్యవసాయ కార్మికుల సమస్యలపట్ల పార్టీల దబుక్పథం మన పార్టీ, వామపక్షాల దృక్పథానికి భిన్నంగా వుంటుంది. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి ప్రత్యామ్నాయ విధానాల ప్రాతిపదికన జాతీయ సా&థయిలో కూడగట్టాలన్న మన ఎత్తగడల పంథా ఆచరణాత్మకమైనది కాకపోవడమే గాక, లోప భూయిష్టమైనది కూడా.

వేరొక ప్రక్క, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, బీహార్, ఒడిషా, ఉత్తరప్రదేశ్‌లలో ఈ పార్టీలతో సుదీర్ఘకాలం కలిసి వుండడంతో, మన పార్టీ స్వతంత్ర అభివృద్ధికి ఆటంకాలేర్పడ్డాయి. అదువల్ల, పార్టీ తన స్వతంత్ర రాజకీయ విధానాన్ని ప్రజల ముందు స్పష్టంగా వుంచలేకపోయింది. అంతేగాక, ప్రాంతీయ బూర్జువా పార్టీల కార్యక్రమానికి భిన్నమైన, విశిష్టమైన వామపక్ష ప్రజాతంత్ర కార్యక్రమాన్ని కూడా వారి ముందుంచలేకపోయింది. దీనికితోడు, ప్రజల సమస్యలమీద, విధానపరమైన అంశాల మీద నిరంతర వుద్యమాలకు గాని, పోరాటాలకు గాని ఈ పార్టీలు యిష్టపడడం లేదు. అందువల్ల జాతీయ స్థాయి సంఘటన ఏర్పాటుకు సంబంధించిన కృషి ప్రధానంగా ఎన్నికల ముందే జరిగింది.

### ఐక్య సంఘటన ఎత్తుగడలు

పార్టీ బలాన్ని పెంచుకునేందుకు ఐక్య సంఘటన ఎత్తుగడలు కమ్యూనిస్టుల ఎత్తుగడల పంథాలో ఒక ప్రధానమైన అంశం. ఇతర పార్టీల ననుసరించే ప్రజాబాహుళ్యంతో కలిసి మెలిసి పనిచేస్తూ వారిని ప్రభావితం చేసేందుకు ఐక్య పోరాటాలు, సంయుక్త కార్యాచరణ పార్టీకి ఎంతగానో తోడ్పడ్డాయి. అయితే టిడిపి, ఎఐఎడిఎంకె, డిఎంకె, బిజూ జనతాదళ్, సమాజ్‌వాదీ పార్టీ వంటి ప్రాంతీయ పార్టీలు ప్రజా బాహుళ్యం యొక్క సమస్యల మీద ఐక్య ఉద్యమాల పట్ల విముఖత ప్రదర్శించాయి. ఆ పార్టీలు కేవలం ఎన్నికల సందర్భంగా అవగాహనకు మాత్రమే సుముఖత చూపాయి. పార్టీ వామపక్షాల బలం పెరగకపోవడం వల్ల ఐక్య వుద్యమాల్లోకి తీసుకురావడం మరింత కష్టమైంది.

ఈ అనుభవాలను దృష్టిలో వుంచుకునే 2012లో కోజిఖోడ్‌లో జరిగిన పార్టీ 20వ మహాసభ మూడవ ప్రత్యామ్నాయం అనే అవగాహనను వదిలి వేసింది. ప్రాంతీయ పార్టీలతో జాతీయ స్థాయి సంఘటనను ఒక ప్రత్యామ్నాయంగా చెప్పేందుకు ప్రాతిపదిక లేదని సమీక్ష నిర్ధారణకు వచ్చింది. దీనికి బదులు, ఉమ్మడి సమస్యలమీద ఐక్య పోరాటాలు నిర్వహించే కృషి కొనసాగాలి.

సెక్యులర్ బూర్జువా పార్టీలతో అఖిల భారత స్థాయిలో ఒక జాతీయ సంఘటన ఏర్పాటు చేయడం, దానిని అన్ని రాష్ట్రాల్లో ఒకేవిధంగా అమలు చేయాలన్న అఖిల భారత విధానాన్ని త్రోసిపుచ్చుతూ, ఎన్నికల సందర్భంలో పరిస్థితిని బట్టి తగిన విధంగా ప్రాంతీయ పార్టీలతో తగిన ఎన్నికల ఎత్తుగడలు అవలంబించవచ్చని సమీక్ష పేర్కొంది. ఈ ఎన్నికల ఎత్తుగడలు రాజకీయ ఎత్తుగడల పంథా పరిధికి లోబడి మాత్రమే వుండాలి. ఇందుకు పార్టీ ప్రయోజనాలు, వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యత అవసరాలను దృష్టిలో వుంచుకోవాలి.

వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఆధిక్యతను పునరుద్ధరించాలి.

ప్రత్యామ్నాయాన్ని రూపొందించే కృషిలో భాగంగా కాంగ్రెసేతర, బిజెపియేతర పార్టీలను సమీకరించాలన్న ఎత్తుగడల పంథా ననుసరించడం వల్ల, అఖిల భారత బూర్జువా పార్టీలు, లేదా ప్రాంతీయ బూర్జువా పార్టీలనుసరిస్తున్న బూర్జువా (పెట్టుబడిదారీ) భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా, వివిధ రాష్ట్రాల్లో వామపక్ష ప్రజాతంత్ర శక్తులను కూడగట్టే నిర్దిష్ట కర్తవ్యాన్ని నిర్వర్తించడంలో విఫలమయ్యాం. అందువల్ల, వామపక్ష ప్రజాతంత్ర శక్తులను కూడగట్టే కఋషిలో పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో మాత్రమే కొంత పురోగతి వుంది. అయితే 1978లో జరిగిన పార్టీ 10వ మహాసభ నాటికే ఆ రాష్ట్రాల్లో ఈ పరిస్థితి నెలకొని వుంది. అందువలన, రాజకీయ ఎత్తుగడల పంథాలోని లోటుపాట్లను సరిదిద్దాలని సమీక్షని వేదిక పేర్కొంది. వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నినాదం యొక్క ఔన్నత్యాన్ని పునరుద్ధరించి, ఆ విధమైన సంఘటన నిర్మాణం వాస్తవ రూపం ధరించే విధంగా కృషి చేయాలని సమీక్ష పేర్కొంది.

1978లో జరిగిన పార్టీ 10వ మహాసభ మొట్టమొదటిసారిగా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రాధాన్యతను పేర్కొంది. ఆ మహాసభ రాజకీయ తీర్మానం ఈ విధంగా పేర్కొంది. "ప్రజలు కేవలం బూర్జువా-భూస్వామ్య పార్టీలు రెండింటిలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకుని, ప్రస్తుత వ్యవస్థ పరిధిలోనే బందీలయ్యే పరిస్థితిని అంతమొందించాలి. ఈ లక్ష్య సాధనకు వర్గ శక్తుల బలాబలాల పొందికలో మార్పు తెచ్చేందుకు చేసే కృషిలో భాగమే ఈ సంఘటన కోసం జరిపే పోరాటం. మరింత పురోగమించేందుకు, అవి వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను కూడగట్టడం ద్వారా పార్టీ ఈ శక్తులను సంఘటిత పర్చే ప్రక్రియను ప్రారంభిస్తుంది. భవిష్యత్‌లో ఈ శక్తులు కార్మికవర్గ నాయకత్వంలో జనతా ప్రజాతంత్ర సంఘటన నిర్మాణంలో భాగస్వాములవుతాయి. వామపక్ష ప్రజాతంత్ర సంఘటనను కేవలం ఎన్నికల కోసమో లేదా మంత్రివర్గ ఏర్పాటు కోసమో ఏర్పడిన సంఘటనగా భావించాదు. తమ తక్షణ రాజకీయ, ఆర్థిక పురోగతి కోసం పోరాటం సాగించే ఒక పోరాట శక్తుల

కూటమిగానూ, ఆర్థిక వ్యవస్థను తమ గుప్పిట్లో పెట్టుకున్న అభివృద్ధి నిరోధక వర్గాలను ఏకాకులను చేసే శక్తుల కలయికగానూ పరిగ ణించవల్సి వుంటుంది."

మనం నిర్మించదల్చుకున్న వామపక్ష ప్రజాతంత్ర సంఘటన అంటే జనతా ప్రజాతంత్ర సంఘటన నిర్మాణానికి మనం సంఘటిత పర్చదల్చిన వర్గాల కూటమి, అని సమీక్ష పునరుద్ఘాటించింది. బూర్జువా భూస్వామ్య అనుకూల విధానాలకు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రాతిపదికగా సమీకరించబడే పోరాట శక్తుల కలయికగా పరిగణించవల్సి వుంటుంది. దీనిని కేవలం ఎన్నికల సందర్భంగా ఏర్పడిన కూటమిగానో లేదా కొన్ని రాజకీయ పార్టీలకు పరిమితమైన అంశంగానో భావించరాదు. ప్రస్తుత ఎత్తుగడల పంథా వామపక్ష ప్రజాతంత్ర సంఘటనలో భాగస్వాములు కాదగిన వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాతంత్ర శక్తులకు జవసత్వాలు కల్గించాలి. వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఏర్పాటు అనే అంశం వివిధ మహాసభల్లో ఆమోదం పొందిన వ్యూహాత్మక లక్ష్యమైనప్పటికీ, వామపక్ష ప్రజాతంత్ర సంఘటనకు సంబంధించిన అవగాహన, దానిని నిర్మించేందుకు పోరాటం సాగించడం పార్టీ వర్తమాన ఎజెండాలో లేకుండాపోయింది.

### పార్టీ స్వతంత్ర శక్తి

పార్టీ స్వతంత్ర శక్తిని పెంపొందించుకునేందుకు అత్యంత ప్రాధాన్యత యివ్వాలని సమీక్ష నివేదిక పేర్కొంది. వివిధ ప్రజా సమస్యలను చేపట్టడం, వాటి పరిష్కారానికి వుద్యమాలు, పోరాటాలు నిర్వహించడం ద్వారా మాత్రమే దీనిని సాధించగలం. దీనితోపాటు ప్రజలను వేధించే వివిధ సమస్యలు, వారి జీవనోపాధి, హక్కులకు సంబంధించిన సమస్యల మీద ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాతంత్ర శక్తులతో ఐక్య కార్యాచరణ చేపట్టాలి. వర్గ, ప్రజాసంఘాలు శక్తివంతమైన విశాల వేదికలుగా అభివృద్ధి చెందినప్పుడు మాత్రమే పార్టీ వామపక్షాలు పురోగమించగలవు. స్వతంత్ర కార్యాచరణ, వామపక్ష ఐక్యత, ప్రజాతంత్ర లౌకిక శక్తులతో ఐక్య కార్యాచరణను పెంపొందించడం వంటి చర్యల ద్వారా మాత్రమే వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం నిర్మించే దిశలో పురోగమించగలం. ప్రాంతీయ బూర్జువా పార్టీలతో ఏ విధమైన జాతీయ స్థాయి సంఘటన వుండబోదు. అయితే రాష్ట్రాల్లో ఎన్నికల సంఘటనలు పార్టీ ప్రయోజనాల ప్రాతిపదికన జరగాలి. ఈ సంఘటనలు వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను సంఘటితం చేసేందుకు తోడ్పడాలి.

పార్లమెంటరీ తత్వం ఒకే సంస్కరణవాద ధోరణి. ప్రజావుద్యమాలను అభివృద్ధి చేయడానికి, పార్టీ నిర్మాణాన్ని, పార్టీ ప్రజా పునాదిని విస్తరింపచేయడానికి ఈ పార్లమెంటరీ తత్వం ప్రతిబంధకంగా తయారైంది. ఎన్నికల సంఘటన ప్రాతిపదికన గాక వర్గ ప్రాతిపదికన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం చేసేందుకు, పార్టీ స్వతంత్ర పాత్రను బలపర్చడం చేసేందుకు రాజకీయ ఎత్తుగడల పంథా తగిన శ్రద్ధ వహించినట్లయితే ఈ ధోరణులను అరికట్టవచ్చు.

### నయా వుదారవాద పెట్టుబడిదారీ విధాన దశ

పెట్టుబడిదారీ విధానంలో నయా వుదారవాద దశ సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో

గణనీయమైన మార్పులు తెచ్చింది. నయా వుదార వాద విధానాలు అన్ని తరగతుల శ్రామికవర్గం మీద తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ మార్పులను, వివిధ తరగతుల ప్రజల మీద ఈ మార్పుల ప్రభావాన్ని అర్థం చేసుకోకుండా శ్రామికవర్గం, రైతాంగం, యువత, విద్యార్థులు తదితర తరగతుల్లో ప్రజా వుద్యమాలను అభివృద్ధి జేసేందుకు అవసరమైన సరైన నినాదాలు, ఎత్తుగడలు రూపొందించడం సాధ్యం కాదు. నయా వుదారవాద పెట్టుబడిదారీ దశకు సంబంధించి సమగ్రమైన అవగాహనను కల్పించుకోవడంలో లోపం జరిగిందని సమీక్షా నివేదిక పేర్కొంది. కార్మికవర్గం పొందికలోనూ, పని స్వభావంలోనూ చాలా మార్పులు సంభవించాయి. ఉదాహరణకు, సంఘటిత రంగంలోని కార్మిక శక్తిలో కాంట్రాక్టు కార్మికుల సంఖ్య బాగా పెరిగింది. వివిధ రకాల పనులు చేస్తున్న కార్మికులు అసంఘటిత రంగంలో పెద్ద సంఖ్యలో వున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని కార్మికుల్లోని అత్యధికులు వ్యవసాయేతర చేతిపనుల్లో నిమగ్నమై వున్నారు. సేవారంగం విస్తరణ వివిధ రకాలైన క్యాజువల్, స్వయం వుపాధి పనులు పెరగడానికి దారితీసింది. ఈ అంశాల నన్నింటిని సమగ్రంగా అధ్యయనం చేసి, తదిన నినాదాలు రూపొందించుకోవాల్సి వుంది. ఇందుకు వ్యవస్థాపరమైన నూతన రూపాలు, పద్ధతులను రూపొందించుకోవాలి. ఈ అంశాలను దృష్టిలో వుంచుకుని కేంద్ర కమిటీ వ్యవసాయ సంబంధాలు, కార్మికవర్గం, మధ్యతరగతి మరియు పట్టణ ప్రాంతాలు అనే అంశాల మీద, అధ్యయనం చేసేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేసింది. పార్టీ, వర్గ, ప్రజాసంఘాలు అవలంబించే ఎత్తుగడలు, యిచ్చే నినాదాలను రూపొందించే సందర్భంలో, ఆ బృందాల నివేదికల సూచనలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. ప్రస్తుతం, తక్షణ ప్రాధాన్యత గల్గిన రెండు అంశాలనుమాత్రం చేపట్టే రాజకీయ సంస్థాగత నివేదికలో పొందుపర్చడం జరిగింది.

### మతతత్వ వ్యతిరేక పోరాటం

మత తత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాలు, అనుభవాలను వేదికలో సమీక్షించడం జరిగింది. కేవలం ఎన్నికల్లో అనుసరించే ఎత్తుగడల ద్వారా హిందూత్వ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడడం సాధ్యంకాదు. సామాజిక, సైద్ధాంతిక, సాంస్కృతిక, విద్యారంగాల్లో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడేందుకు నిర్దిష్ట చర్యలను రాజకీయ ఎత్తుగడల పంథాలో సూత్రీకరించవల్సి వుంది. నయా వుదారవాద విధానాల ప్రభావానికి వ్యతిరేకంగా సాగే పోరాటాన్ని, మతోన్మాదానికి వ్యతిరేకంగా చేసే పోరాటంతో సమ్మిళితం చేయాలి. అప్పుడు మాత్రమే మతోన్మాద ప్రమాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలోకి ప్రజా బహుళ్యాన్ని సమీకరించడం సాధ్యపడుతుంది. హిందూత్వ మతోన్మాద శక్తుల వ్యతిరేక పోరాటంలోకి విశాల ప్రాతిపదికన లౌకిక, ప్రజాతంత్ర శక్తులను సమీకరించేందుకు తీవ్రంగా కృషి చేయాలి. ఈ విమర్శనాత్మక సమీక్ష ప్రాతిపదికన భవిష్యత్ రాజకీయ ఎత్తుగడల పంథాను రాజకీయ తీర్మానం రూపంలో ఆమోదించడం జరిగింది.

రాబోయే కాలంలో పార్టీ అనుసరించవల్సిన రాజకీయ ఎత్తుగడల పంథాను పార్టీ 21వ మహాసభ ఆమోదించిన రాజకీయ తీర్మానం స్పష్టం చేసింది. వర్తమాన రాజకీయ ఎత్తుగడల పంథాలను, పార్టీ చేపట్టవల్సిన కర్తవ్యాలను సూత్రీకరించేందుకు, ప్రస్తుతం అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో నెలకొన్న పరిస్థితులను రాజకీయ తీర్మానం విశ్లేషించింది.

## అంతర్జాతీయ పరిస్థితి

అంతర్జాతీయ పరిస్థితిని గురించి రాజకీయ తీర్మానం ఈ క్రింది అంశాలను ప్రముఖంగా పేర్కొంది. (1) వివిధ ప్రభుత్వాలు "పొదుపు చర్యల" పేరిట ప్రభుత్వ వ్యయంలో తీవ్రంగా కోత విధించడం వ్యవస్థాపరమైన సంక్షోభానికి సంబంధించిన ప్రస్తుత దశను వెల్లడిస్తోంది. ఇది, కార్మికవర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులమీద బహిరంగ దాడి తప్ప వేరేమీ కాదు. ఫలితంగా అన్ని పెట్టుబడిదారీ దేశాల్లోనూ అసమానతలు తీవ్రమయ్యాయి. ఇది భవిష్యతః సంక్షోభానికి బీజాలు వేస్తుంది. వ్యయంలో కోత ఫలితంగా ప్రజల కొనుగోలు శక్తి దిగజారి పోవడం వల్ల అప్పటికే కొనసాగుతున్న సంక్షోభం మరింత తీవ్రమవుతుంది.

2. తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే ప్రయత్నాల్లో భాగంగా, అమెరికా, పశ్చిమాశియాలో మిలిటరీ జోక్యాన్ని కొనసాగిస్తోంది. ఇరాక్, లిబియాల్లో జోక్యం తర్వాత, సిరియాలో ఇస్లామిక్ తిరుగుబాటు దారులకు మద్దతిస్తున్న అభివృద్ధి నిరోధక అరబ్ రాజ్యాలకు అమెరికా మద్దతిస్తోంది. ఫలితంగా ఇరాక్, సిరియాల్లో ఐఎస్ఐఎస్ (ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా – ఉగ్రవాద సంస్థ) తలెత్తింది. ఎమెన్‌లో సౌదీ అరేబియా నాయకత్వంలో సాగుతున్న తాజా మిలిటరీ దాడులకు కూడా అమెరికా మద్దతిస్తోంది. ఈ ప్రాంతంలో ఇస్లామిక్ ఉగ్రవాదం ప్రబలడానికి సామ్రాజ్యవాదుల జోక్యం ప్రత్యక్ష కారణమైంది.

3. ఎన్ఎటివో సైనిక కూటమి పరిధిని తూర్పు ప్రాంతానికి విస్తరించడం వల్ల, ఉక్రెయిన్ విషయమై అమెరికా, రష్యాల మధ్య ఘర్షణ నెలకొంది. ఉక్రెయిన్ సంఘర్షణ, యూరపులోని ప్రధాన పెట్టుబడిదారీ దేశాల మధ్య వున్న వైరుధ్యాలను ప్రతిబింబిస్తోంది. అమెరికా, ఐరోపా దేశాలు ఒక ప్రక్క నిలవగా, రష్యా తదితర దేశాలు వేరొక పక్క నిలిచాయి.

4. సంప్రదింపుల దశలో వున్న ట్రాన్స్ పసిఫిక్ పార్ట్‌నర్ షిప్ (టిపిపి), ట్రాన్స్ అట్లాంటిక్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ పార్ట్‌నర్ షిప్ (టిటిఐపి) వంటి నూతన వాణిజ్య ఒప్పందాలు ఆర్థిక రంగంలో అమెరికా ఆధిపత్యం కొనసాగించడాని కుద్దేశించినవే. ఈ తరహా వాణిజ్య ఒప్పందాల వల్ల కార్పొరేట్ సంస్థలు మరింత బలోపేతమై, ప్రభుత్వాలకు మార్కెట్లను నియంత్రించడం కష్టసాధ్యమవుతుంది.

5. యూరపులో పొదుపు చర్యలకు వ్యతిరేకంగా ప్రజా వుద్యమాలు, కార్మికవర్గ పోరాటాలు కొనసాగుతున్నాయి. గ్రీస్‌లో పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో "సిరిజా" అనే వామపక్ష పార్టీ విజయం సాధించడం ప్రాధాన్యత గల్గిన పరిణామం. సంక్షోభం నుండి

యీ దేశం ఏ విధంగాబయటపడుతుందో ఇంకా చూడవల్సి వుంది. అయితే యూరపులో మొట్టమొదటిసారి గ్రీస్ ప్రజలు నయా వుదార వాద విధానాలకు రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ఎంచుకున్నారు.

6. రష్యా, చైనాల మధ్య నానాటికి పెంపొందుతున్న వ్యూహాత్మక సహకారం, బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) కూటమి ఏర్పాటు, ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌ను నెలకొల్పేందుకు చైనా చొరవ తీసుకోవడం వంటి పరిణామాలు, బహుళ ధృవ ప్రపంచం వైపుకు పయనించే పోకడలను బలపరుస్తున్నాయి.

7. అమెరికా మద్దతు గల్గిన అభివృద్ధి నిరోధక శక్తుల నుండి వెనెజులా తీవ్ర సవాళ్ళ నెదుర్కొంటున్నప్పటికీ, లాటిన్ అమెరికాలో వామపక్ష శక్తుల పురోగమనం కొనసాగుతోంది. క్యూబన్ ఫైవ్ (క్యూబా మీద కుట్రలు చేసే సంస్థల మీద నిఘా వేసి, ఆ దేశంపై దాడులను నివారించే లక్ష్యంతో అమెరికాలోని మియామీలో కృషి చేస్తున్న ఐదుగురు క్యూబన్ దేశభక్తులను నిర్బంధించి విచారణ తతంగం నడిపి, శిక్షలు విధించడం జరిగింది. (అనువాదకుడు) ను విడుదల చేసి, క్యూబాతో దౌత్య సంబంధాలు పునరుద్ధరించేందుకు అమెరికా అంగీకరించడం క్యూబా సాధించిన ఘనవిజయం.

8. బంగ్లాదేశ్‌లో అభివృద్ధి నిరోధక ఛాందసవాద శక్తులకు, లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు మధ్య తీవ్ర పోరాటం కొనసాగుతోంది. శ్రీలంకలో జరిగిన ఎన్నికల్లో రాజపక్సే పరాజయం చెంది సిరిసేన అధ్యక్షునిగా నూతన ప్రభుత్వం ఏర్పడడం, అక్కడ ప్రజాతంత్ర వ్యవస్థను పరిరక్షించేందుకు దోహదం చేస్తుంది. శ్రీలంకలోని తమిళుల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలను నూతన ప్రభుత్వం చేపట్టాలి.

పాలస్తీనా ప్రజల పోరాటంతో సహా ప్రపంచ వ్యాప్తంగా సాగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు ఆర్టీ తన మద్దతును ప్రకటిస్తుంది. లాటిన్ అమెరికాలోని సోషలిస్టు దేశాలకు, వామపక్ష, విప్లవోద్యమాలకు సంఘీభావం తెల్పుతోంది.

అంతర్జాతీయ పరిస్థితికి సంబంధించిన రెండు అంశాలు అభివృద్ధి నిరోధక పోకడలమీద ప్రభావం చూపుతున్నాయి. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ 2008 ఆర్థిక సంక్షోభం నుండి అతిస్వల్పంగానే కోలుకుంది. అదైనా కొనసాగుతుందన్న నమ్మకం లేదు. ఈ పరిస్థితుల వల్ల అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, సామ్రాజ్యవాదం ప్రపంచ వ్యాప్తంగా మరిన్ని నయావుదార చర్యలను అమలు చేయబూనుకున్నాయి. భారత పాలక వర్గాలు కూడా యీ విధమైన చర్యలను చేపట్టడం ద్వారానే క్లిష్టంగా వున్న ఆర్థిక పరిస్థితిని ఎదుర్కోవాలని కోరుకుంటున్నాయి.

నానాటికి శక్తివంతమవుతున్న చైనాను కట్టడి చేసేందుకు అమెరికా ఆసియా కేంద్రీకరిస్తోంది. ఇందుకే ఆసియా–పసిఫిక‌ ప్రాంతంలో సమతుల్యాన్ని మార్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అమెరికా పన్నిన ఈ వ్యూహంలో భారత‌ కీలక పాత్ర పోషించాలని అమెరికా భావిస్తోంది. అమెరికాతో ఈ సన్నిహిత వ్యూహాత్మక బంధం అభివృద్ధి నిరోధక పోకడలకు ప్రేరణ కల్గిస్తోంది.

## మోడి ప్రభుత్వ పాలన

తమకు మద్దతుగా వున్న బడాబూర్జువా వర్గం ఆదేశాల మేరకే మోడీ ప్రభుత్వం పనిచేస్తుందని 11 నెలల మోడీ ప్రభుత్వ పాలనానుభవం ధృవీకరిస్తోంది. వివిధ రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) ప్రవేశాన్ని అనుమతించడం, కొన్ని రంగాల్లో ఆ పరిమితి పెంచడం, బొగ్గు పరిశ్రమను విజాతీయం చేయడం వంటి ప్రైవేటీకరణ చర్యలు వేగవంతం చేయడం, కార్పొరేట్ సంస్థలు పెద్ద ఎత్తున భూమిని కబళించేందుకు వీలుగా భూసేకరణ చట్టానికి సవరణలు చేయడం వంటి మోడీ ప్రభుత్వ చర్యలు, నయా వుదారవాద విధానాల అమలు జోరును స్పష్టం చేస్తున్నాయి.

కొద్దిమంది బడా బాబులకు సంపద కట్టబెట్టేందుకు, అత్యధికుల కడుపులు మాడ్చే పొదుపు చర్యలు చేపట్టాలనే నయా వుదార వాద విధానాల పట్ల మోడీ ప్రభుత్వం మక్కుతో వుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి (హెచ్‌జిఎన్‌ఆర్‌ఇజిఎ) కేటాయింపులు, పరిధి తగ్గించడం ద్వారా కుదించి వేస్తున్నారు. బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు కేటాయింపులు సగానికి తగ్గించారు. చివరకు ఆహార భద్రతా చట్టం అటవీ హక్కుల చట్టం తదితర చట్టాల ద్వారా సాధించుకున్న హక్కులను కూడ మోడి ప్రభుత్వం కాలరాచివేయ బూనుకుంది. కార్మిక చట్టాలకు సవరణలద్వారా కార్మిక హక్కులను కుదించివేయ బూనుకుంది. ఆర్డినెన్స్‌ల ద్వారా పాలన సాగించే మోది ప్రభుత్వ విధానాలు ఆ ప్రభుత్వ నియంతృత్వ స్వభావానికి సంబంధించిన ముందస్తు హెచ్చరికలని గుర్తించాలి.

ఈ పదకొండు నెలల కాలంలో రైతాంగం దుస్థితి మరింత విస&ఇరించింది. ఆహార వస్తువుల ధరల పెరుగుదల నుండి సామాన్య మానవునికి ఏమాత్రం వూరట లేకుండాపోయింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదల్లో నిరుద్యోగం ద్విగుణీకృతమైంది.

హిందూత్వ మతోన్మాద పథకాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు బహుముఖ ప్రయత్నాలు సాగుతుండడం మతవాద అభివృద్ధి నిరోధక దాడులకు సంబంధించిన మరో లక్షణం. బిజెపి ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్‌తో సమన్వయంతో, సన్నిహితంగా పనిచేస్తుండడంవల్ల పరిస్థితుల్లో గుణాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. విద్యా రంగంలోనూ, పరిశోధనా సంస్థల్లోనూ, సాంస్కృతిక సంస్థల్లోనూ తమ ఎజెండాను ప్రవేశపెట్టాలని ఆర్.ఎస్.ఎస్. కోరుకుంటోంది. మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించి, దేశంలో మతపరమైన విభజన తీసుకు వచ్చే లక్ష్యంతో ఆర్‌ఎస్‌ఎస్ దాని అనుబంధ సంస్థలు గోవధ, లవ్ జిహాద్ (గా చెప్పబడుతున్న), సరిహద్దు రాష్ట్రాల్లో బంగ్లాదేశ్ చొరబాటు దారుల సమస్య వంటి సమస్యలను క్షేత్రస్థాయిలో చేపడ్తున్నాయి.

## విదేశాంగ విధానంలో మతవాద అభివృద్ధి నిరోధక మార్పు

మోడి ప్రభుత్వం విదేశాంగ విధానంలో కూడా మతవాద అభివృద్ధి నిరోధక మార్పు స్పష్టమైంది. 1990 దశకంలో సరళీకరణ విధానాల అమలు ప్రారంభదశ నుండి దేశం అలీన విదేశాంగ విధానం నుండి దూరమై, అమెరికా అనుకూల వైఖరి నవలంబించడం ప్రారంభమైంది. మోడీ ప్రభుత్వం మరింత దూకుడుగా వ్యవహరిస్తూ, యుపిఎ ప్రభుత్వం

అమెరికాతో నెలకొల్పిన వ్యూహాత్మక బంధనాలను, మోడీ ప్రభుత్వం మరింత దూకుడుగా వ్యవహరిస్తూ మరింత పటిష్టం చేస్తోంది. భారత– అమెఇకా రక్షణ ఒప్పందాన్ని మరో 10 సం॥ల పాటు పొడిగించారు. ఒబామా పర్యటన సందర్భంగా ఆసియా–పసిఫిక్ మరియు హిందూ మహాసముద్ర ప్రాంతానికి సంబంధించి ఒబామా, మోడితో కలిసి భవిష్యత్‌కు సంబంధించిన సంయుక్త ప్రకటన (జాయింట్ విజన్ స్టేట్‌మెంట్)ను విడుదల చేశారు. ఈ ప్రకటనను పరిశీలిస్తే ఇండియా ప్రతిపాదించిన "యాక్ట్ ఈస్ట్" విధానానికి, చైనా పలుకుబడిని కట్టడి చేసే లక్ష్యంతో అమెరికా తలపెట్టిన "పివోట్ ఈస్ట్" వ్యూహంతో జోడించడం జరిగిందని స్పష్టమవుతుంది. జపాన్, ఆస్ట్రేలియాలతో మిలిటరీ సహకారాన్ని పటిష్టం చేసుకోవాలని మోడి ప్రభుత్వం వుబలాట పడ్తోంది. ఈ సంబంధాలు అమెరికా తలపెట్టిన అమెరికా, ఇండియా, జపాన్, అస్ట్రేలియాలను కలుపుకుని చతుర్ముఖ కూటమిలో భారత్‌ను బంధించడం జరుగుతోంది. సామ్రాజ్యవాద వ్యతిరేక కార్యకలాపాలు, పోరాటాలను వుధృతం చేయాలని మహాసభ పిలుపు ఇస్తోంది.

సారాంశం

మతవాద అభివృద్ధి నిరోధక శక్తుల దాడిని ప్రతిఘటించడం, ఈ సందర్భంగా అనుసరించవల్సిన రాజకీయ ఎత్తుగడల పంథాను రూపొందించుకోవడం ఈ రాజకీయ తీర్మానం యొక్క ప్రధాన సారాంశం. వివిధ తరగతుల ప్రజల మీద ప్రభావం చూపుతున్న సమస్యల పరిష్కారానికి పార్టీ, ప్రజా సంఘాలు, ప్రజా పోరాటాలను, ఉద్యమాలను పెంపొందించాల్సిన అవసరాన్ని గురించి ఎత్తుగడల పంథా ప్రముఖంగా పేర్కొంది. కార్మికవర్గం, రైతాంగం, వ్యవసాయ కార్మికులు, మహిళలు, యువత, విద్యార్థులు, దళితులు, ఆదివాసీలు వంటి వివిధ ప్రజా రంగాల్లో పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించేందుకు అవసరమైన దిశను తీర్మానం నిర్దేశించింది.

## మతోన్మాద వ్యతిరేక పోరాటం

హిందూత్వ మతోన్మాద శక్తులకు, మతోన్మాద వ్యతిరేక పోరాటానికి తీర్మానం ప్రాధాన్యతనిచ్చింది. సామాజిక, సాంస్కృతిక, సైద్ధాంతిక, విద్యారంగాల్లో మతోన్మాద శక్తులను ఎదురొడ్డి పోరాడేందుకు కావల్సిన నిర్దిష్ట ఎత్తుగడలను రూపొందించుకోవల్సిన అవసరాన్ని రాజకీయ ఎత్తుగడల పంథా సమీక్ష ఎత్తి చూపింది. దీని ప్రాతిపదికగా, పార్టీ, వర్గ, ప్రజా సంఘాలు ఈ రంగాల్లో చేపట్టవల్సిన ఐదు కర్తవ్యాలను తీర్మానం నిర్దేశించింది. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా సాగించే పోరాటానికి, పార్టీకున్న మేధోపరమైన సాంస్కృతిక పరమైన వనరులను సమీకరించడం, ప్రజాతంత్ర, లౌకిక విద్యావ్యవస్థను పరిరక్షించేందుకు విద్యారంగంలో జోక్యం పెంచడం, సాంస్కృతిక సామాజిక కార్యకలాపాలను, ప్రధానంగా కార్మిక వర్గ నివాస ప్రాంతాల్లో అభివృద్ధి చేయడం, మతోన్మాద శక్తులు వెదజల్లే విచ్ఛిన్నకర విలువలను, ప్రమాదకరమైన కులతత్వాన్ని ఎదుర్కొనేందుకు, సాంస్కృతిక, సామాజిక కార్యకలాపాలను విస్తరింపచేయడం, అంతిమంగా ఆర్.ఎస్.ఎస్. అనుబంధ సంస్థలు కార్యకలాపాలను ఎదుర్కొనేందుకు ఆదివాసులు నివసించే ప్రాంతాల్లోనూ, దళితుల్లోనూ సంస్థాగతమైన కార్యకలాపాలను విస్తరించాలి.

## రాజకీయ పంథా

బిజెపి, మోడి ప్రభుత్వ విధానాల వ్యతిరేక పోరాటాన్ని ప్రధాన కర్తవ్యంగా రాజకీయ పంథా నిర్దేశిస్తోంది. నయా వుదారవాద విధానాలకు వ్యతిరేకంగానూ, ప్రజల జీవనోపాధి పరిరక్షణకు సాగే పోరాటాలను, మతోన్మాదం, బిజెపి–ఆర్ఎస్ఎస్ కూటమి యొక్క రాజకీయ–సైద్ధాంతిక విధానాలకు వ్యతిరేకంగా సాగే పోరాటాలతో సమ్మిళితం చేయాలని ఎత్తుగడల పంథా పిలుపునిస్తోంది.

పోరాటం ప్రధానంగా బిజెపికి వ్యతిరేకంగా ఎక్కుపెట్ట వల్సి వున్నప్పటికీ, నయా వుదార వాద విధానాల ననుసరిస్తున్నది. కనుక కాంగ్రెస్‌ను వ్యతిరేకించే విధానాన్ని పార్టీ కొనసాగిస్తుంది. కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, అవినీతి, బిజెపి అధికారంలోకి రావడానికి తోడ్పడ్డాయి. అందువలన, కాంగ్రెస్‌తో ఏ విధమైన అవగాహనను గాని, ఎన్నికల కూటమినిగాని రాజకీయ పంథా నిరాకరిస్తుంది.

ప్రాంతీయ పార్టీలతో సహా వివిధ రాజపార్టీల నాయకత్వం లోని రాష్ట్ర ప్రభుత్వాలనుసరిస్తున్న నయా వుదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని, రాజకీయ పంథా ఒక నూతన దిశను నిర్దేశించింది. కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి, వారిని సిపిఐ(ఎం) మరియు ఇతర వామపక్ష ప్రజాతంత్ర వేదిక క్రింద సమీకరించేందుకు, ప్రాంతీయ పార్టీలనుసరిస్తున్న బూర్జువా–భూస్వామ్య రాజకీయాలను, ఆ విధానాలను వ్యతిరేకించాలని కూడా రాజకీయ పంథా చెప్తోంది. నేటివరకు అనుసరించిన రాజకీయ ఎత్తుగడల పంథాను సమీక్షించిన ఫలితమే ఇది.

పార్టీ స్వతంత్ర బలాన్ని అభివృద్ధి చేసేందుకు అత్యంత ప్రాధాన్యత యివ్వాలని రాజకీయ పంథా నిర్దేశిస్తోంది. పార్టీ, వామపక్ష శక్తులు పరాజయాన్నెదుర్కొన్న నేటి పరిస్థితుల్లో, పార్టీ స్వతంత్ర బలాన్ని పునరుద్ధరించుకుని, విస్తరింపచేయడం అత్యంత ప్రాధాన్యత గల్గిన అంశం. పార్టీ స్వతంత్ర బలం పెంచుకునేందుకు, ఐక్య పోరాటాలు, సంయుక్త కార్యాచరణ అత్యవసరం. ప్రజా సమస్యల పరిష్కారానికి జాతీయ సార్వభౌమత్వ పరిరక్షణ, రాష్ట్రాల హక్కుల సాధనకు, సామ్రాజ్య వాద వ్యతిరేకత వంటి అంశాల మీద ఇతర ప్రజాతంత్ర శక్తులు, కాంగ్రెసేతర సెక్యులర్ పార్టీలతో కలిసి ఐక్య పోరాటాలు, ప్రజా వుద్యమాలు నిర్వహించాలి. కాంగ్రెస్, బిజెపి తదితర బూర్జువా పార్టీల ననుసరిస్తున్న ప్రజాబాహుళ్యాన్ని ఐక్య పోరాటాల్లోకి తీసుకురావడమే, వర్గ, ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ లక్ష్యం.

వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను సమీకరించి, క్రమక్రమంగా వామపక్ష ప్రజాతంత్ర సంఘటనకు వాస్తవ రూపం యివ్వాలని రాజకీయ పంథా కోరుతోంది. పార్టీని బలోపేతం చేసి, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను సమీకరించడమే, పార్టీ ఎన్నికల ఎత్తుగడలకు ప్రాతిపదికగా వుండాలి.

పార్టీ స్వతంత్ర బలాన్ని పెంపొందించడం, వామపక్ష ఐక్యతను విస్తరింపచేయడం, మరింత బలోపేతం జేయడం, వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మించడం, పార్టీ రాజకీయ ఎత్తుగడల పంథాకు కీలకమైన అంశం.

## పార్టీ స్వతంత్ర శక్తి

పార్టీ స్వతంత్రంగా విస్తరించాలంటే వర్గ, ప్రజా సంఘాలనభివృద్ధి చేయడం అత్యంత ఆవశ్యకమైనది. స్థానిక సమస్యల మీద నిరంతరాయంగా పోరాటాలు అభివృద్ధి చేసినట్లయితే అది, నయావుదార వాద విధాన వ్యతిరేక పోరాటాలతో సంబంధాలు కల్పిస్తుంది. సామాజిక సమస్యల విషయంలో పార్టీ ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని పోరాటాలు చేపట్టాలి. పార్టీ స్వతంత్ర బలాన్ని విస్తరింప జేయడమంటే, పశ్చిమ బెంగాల్‌లో పార్టీ ఎదుర్కొంటున్న అననుకూల పరిస్థితులను, ప్రజా పునాదిలో కోతను అధిగమించాలని కూడా అర్థం చేసుకోవాలి. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు పోరాటం సాగించడం ద్వారాను, తృణమూల్ కాంగ్రెస్ హింసాకాండను ప్రతిఘటించడం ద్వారానూ, జీవనోపాధికి సంబంధించిన సమస్యల మీద ప్రజలను సమీకరించడం, నానాటికి పెరుగుతున్న మతోన్మాద శక్తుల ప్రమాదాన్ని ప్రతిఘటించడం ద్వారా పార్టీ ప్రతికూల పరిస్థితులనధిగ మించాలి. కేరళలో ప్రజా పునాదిని పటిష్టం చేసుకుని వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్)ను బలోపేతం చేసుకోవాలి. త్రిపురలో పార్టీ తన ప్రజా పునాదిని విస్తరింపచేసుకుంది. వామపక్ష సంఘటన ప్రభుత్వం చేసిన మంచి పనులు పార్టీ తన పలుకుబడిని విస్తరింప జేయడానికి తోడ్పడింది. పార్టీ పలుకుబడిని పటిష్ట పర్చుకునేందుకు చర్యలు తీసుకోవాలి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నుండి వచ్చేదాడుల నుండి వామపక్ష సంఘటన ప్రభుత్వాన్ని పరిరక్షించుకునేందుకు జాగరూకులై వుండాలి.

## వామపక్ష ఐక్యత

వామపక్ష ఐక్యతను బలోపేతం చేయాలన్న మరో కర్తవ్యాన్ని కూడా తీర్మానం నిర్దేశించింది. అందుకు వామపక్ష పార్టీలను, బృందాలను, వ్యక్తులను ఒక వుమ్మడి వేదిక మీదకు తీసుకు రావడం ద్వారా వామపక్ష ఐక్యవేదిక పరిధిని విస్తరించవల్సి వుంది. ప్రస్తుతం ఆరు వామపక్ష పార్టీలు ఐక్య కార్యాచరణకు కలిసి వచ్చాయి. విశాల వామపక్ష వేదికను రూపొందించేందుకు, ఈ ఐక్యతను మరింత ముందుకు తీసుకుపోవాల్సి వుంది.

## వామపక్ష ప్రజాతంత్ర సంఘటన

వామపక్ష ప్రజాతంత్ర సంఘటన స్వరూపాన్ని తీర్మానం వివరించింది. పార్టీ 10వ మహాసభ తర్వాత మొదటిసారి తీర్మానం దీనిని ఈ క్రింది విధంగా వివరించింది : "ప్రస్తుతానికి వామపక్ష ప్రజాతంత్ర సంఘటనలోకి రాబట్టగల్గిన శక్తులకు కేంద్రంగా వుండగలిగింది. వామపక్ష పార్టీలు, వాటి వర్గ మరియు ప్రజాసంఘాలు; వామపక్ష గ్రూపులు; మేథావులు; వివిధ పార్టీల్లో చెల్లాచెదురుగా వున్న సోషలిస్టులు; కాంగ్రెసేతర సెక్యులర్ పార్టీల్లోని ప్రజాతంత్ర తరగతులు; దళితులు, మహిళలు మరియు మైనారిటీలు; అణచివేతకు గురవుతున్న తరగతుల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సామాజిక వుద్యమకారులు – బూర్జువా–భూస్వామ్య పార్టీల విధానాలకు వ్యతిరేకమైన ఒక నిర్దిష్ట కార్యక్రమం ప్రాతిపదికగా, ఈ శక్తులనన్నింటిని ఒకే వేదిక మీదకు తీసుకు రావడం ద్వారా మాత్రమే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఒక నిర్దిష్ట రూపం సంతరించుకోగలదు.

ఉమ్మడి కోర్కెల పత్రం ప్రాతిపదికన వివిధ వర్గ, ప్రజాసంఘాల నన్నిటితో ఒక వుమ్మడి వేదిక నిర్మించడం ఈ దిశలో కృషికి నాంది కాగలదు."

వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతకు సాగే పోరాటం వివిధ రాష్ట్రాల్లో వివిధ పద్ధతుల్లో సాగుతుంది. వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలైన వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల కలయికలు చోటు చేసుకుంటాయి. అయితే ఈ విభిన్న కలయికలు అఖిల భారత స్థాయిలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణానికి సహాయపడతాయి. తీర్మానం పేర్కొన్న వామపక్ష ప్రజాతంత్ర కార్యక్రమంలో కార్మికవర్గం, పేద రైతాంగం, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ కార్మికులు, మధ్యతరగతి ప్రజలు, మేధావుల తక్షణ కోర్కెలను చేర్చడం జరిగింది. వివిధ తరగతుల ప్రజలను, సామాజిక అణచివేతకు గురవుతున్న తరగతుల ప్రజలను సంఘటితం చేసేందుకు, పార్టీ, వామపక్షాలు, ఈ డిమాండ్ల సాధనకు పోరాటాలు నిర్వహించగలగాలి.

ఈ ఏడాది చివరిలోగా "సంస్థాపరమైన నిర్మాణం" మీద ఒక ప్లీనం కూడా నిర్వహించాలని పార్టీ మహాసభ ఒక తీర్మానం ఆమోదించింది. పార్టీ తన స్వతంత్ర శక్తిని పెంపొందించుకుని, వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం విషయంలో పురోగమించే విధంగా పార్టీ రాజకీయ పంథాను అమలు చేసేందుకు, పార్టీ వ్యవస్థాగత నిర్మాణం, ప్రజాసంఘాల మీద జరిపిన సమీక్ష, సంస్థను (పార్టీని) పునర్ వ్యవస్థీకరించి, కర్తవ్య నిర్వహణకు సన్నద్ధం చేస్తుంది.

మతవాద అభివృద్ధి నిరోధకుల దాడులను ఎదుర్కొని, నయా వుదార వాద విధానాలు, మతతత్వం, సామ్రాజ్య వాదాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని ముందుకు నడిపేందుకు తీర్మానం ఎనిమిది కర్తవ్యాలను నిర్దేశించింది.

(1) మతవాద అభివృద్ధి నిరోధక దాడులను తీవ్రమైనవిగా పరిగణించాలి. నయా వుదారవాద విధానాలలో భాగమైన బిజెపి ప్రభుత్వ ఆర్థిక విధానాలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాలి. వివిధ తరగతుల కార్మికవర్గాన్ని సంఘటితం చేసి, వివిధ రూపాల్లో కార్మికవర్గం మీద సాగుతున్న నయా వుదార దాడులను ప్రతిఘటించాలి.

(2) సామాజిక, సాంస్కృతిక, సైద్ధాంతిక, విద్యా రంగాల్లో బిజెపి–ఆర్ఎస్ఎస్ కూటమి మతోన్మాద ఎజండాను, పార్టీ, ప్రజాసంఘాలు రాజకీయంగానూ, క్షేత్ర స్థాయిలోనూ ఎదుర్కొనాలి. మతోన్మాద ప్రమాదానికి వ్యతిరేకంగానూ, సెక్యులర్ విలువల పరిరక్షణకు విశాల ప్రాతిపదికన సెక్యులర్, ప్రజాతంత్ర శక్తులను సమీకరించాలి.

(3) సామ్రాజ్యవాద వ్యతిరేక ఎజెండాను పార్టీ నిరంతరం చేపట్టాలి. నానాటికి అమెరికాతో బిగుస్తున్న వ్యూహాత్మక బంధానికి, అమెరికా ఒత్తిళ్ళకు లొంగుతున్న పాలకవర్గాల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను పెద్దఎత్తున సమీకరించడం ఇందులో భాగంగా వుంటుంది. ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు మద్దతునందించాలి.

(4) సామాజిక అణచివేతకు గురవుతున్న తరగతులు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ప్రయోజనాల పరిరక్షణకు కృషిని మరింత పెంచాలి. మహజిళా హక్కుల

పరిరక్షణలో పార్టీ ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవాలి. మహిళలపై నానాటికీ పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి.

(5) ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణ, కళాకారులకు స్వేచ్ఛ కోసం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మీద ఆంక్షలకు వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన సమీకరించడం ద్వారా, మతవాద అభివృద్ధి నిరోధక దిశకు మొగ్గిన ఫలితంగా తలెత్తుతున్న నియంతృత్వ ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాటం సాగించాలి.

(6) పశ్చిమబెంగాల్ లో హింసాకాండ నుండి, ప్రజాస్వామ్యంపై దాడుల నుండి పార్టీని, వామపక్షాలను కాపాడుకునేందుకు జరిగే పోరాటానికి మద్దతుగా అఖిల భారత స్థాయిలో ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు ప్రచారోద్యమం నిర్వహించాలి. వామపక్ష ప్రజాతంత్ర శక్తులు అభివృద్ధి నిరోధక శక్తుల దాడులు, కేంద్ర ప్రభుత్వ శత్రుపూరిత వైఖరి నుండి త్రిపురలోని వామపక్ష ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి.

(7) పార్టీ తన స్వతంత్ర పాత్రను విస్తరింపచేయడానికి, తన బలాన్ని, ప్రజాపునాదిని పెంచుకునేందుకు అత్యంత శ్రద్ధ వహించాలి. వర్గ ప్రజాసమస్యల మీద ఐక్య కార్యాచరణకు పార్టీ ప్రాధాన్యత యివ్వాలి. బూర్జువా పార్టీలననుసరించే ప్రజలను సమీకరించేందుకు వర్గ, ప్రజాసంఘాలు ఐక్య వుద్యమాలకు అత్యంత ప్రాధాన్యత యివ్వాలి.

(8)వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఏర్పాటు దిశలో పురోగతి సాధించేందుకు, వామపక్ష ఐక్యతను నిర్మించి, విస్తరింప జేయడంతోపాటు, వివిధ వర్గాలను, కార్మికవర్గాన్ని వామపక్ష ప్రజాతంత్ర కార్యక్రమం ప్రాతిపదికగా సమీకరించాలి.

మతవాద అభివృద్ధి నిరోధక శక్తులు, బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని, నయా వుదార వాద వ్యతిరేక పోరాటాన్ని, మతోన్మాద వ్యతిరేక పోరాటంతో సమ్మిళితం చేయాలని, రాజకీయ ఎత్తుగడల పంథా ప్రధాన దిశా నిర్దేశం చేసింది. ఇది, పార్టీ తన స్వతంత్ర బలాన్ని పెంచుకోవడానికి, ప్రజల్లో తన పలుకుబడిని విస్తరింపచేసుకోవడానికి సిపిఐ(ఎం)కు బృహత్తర అవకాశం కల్పించింది.

బలమైన సిపిఐ(ఎం) నిర్మాణం, వామపక్ష ఐక్యత విస్తరణ, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల సమీకరణల ద్వారా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఏర్పాటుకు ఒక్కొక్క అడుగు వేసి ముందుకు సాగగలం. విశాఖపట్నం మహాసభ ఈ స్ఫూర్తిదాయకమైన పిలుపునిచ్చింది.